THE WORD OF TRUTH

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్య వాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలో మేము ముద్రించబోవునట్టి పుస్తకములను, సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYAVANI**
(P.O. Box 80) Seshagiri Rao St.,
KAKINADA - 533 004

గమనిక :—మీరు M. O. పంపునప్పుడుగాని, మీ అడ్రసులో మార్పు వచ్చినప్పుడుగాని మీ సత్యవాక్కు నంబరును దయచేసి తెలియ జేయండి.

Razan Electric Press, Kakinada

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80 KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **12** జూలై **1982** సంపుటి **2**

# సంపాదకీయము

## క్రీస్తుకు సమర్పించుకొనుట అనగా యేమిటి?

*(What does it mean to be Committed to Christ?)*

క్రైస్తవుడగుటను చులకనగా ఎంచరాదు. అది చాల తీవ్రమైన సంగతి. ఒకడు దేవుని చిత్తమును ఎరుగుట మాత్రమే కాదు గాని దానిని తన హృదయపూర్వకముగా విశ్వసించి, అతడు రక్షింపబడునట్లు క్రీస్తునామమును ధరించగల్గునట్లు ఆయన షరతులకు లోబడవలెను.

ఒక ప్రమాదావసత్తువలన యెవడు క్రైస్తవుడు కాజాలడు. అతడు కొన్ని పూజాపునస్కారములు చేసి తాను దేవుని కుటుంబ సభ్యుడనని, క్రీస్తు అనుచరుడనని తరువాత తెలిసికొనడు. సువార్తకు వేరుగా, దానికి లోబడకుండా పొందే బాప్తిస్మములో విలువ యేమీ లేదు. బాప్తిస్మము పొందుట అత్యవసరమే అయినను అది కేవలము నీటిలో ముంచడము మాత్రమేకాదు, లేదా ఒక మానవ కల్పిత

సిద్ధాంతమునకు కట్టుబడి యుండుట కాదు. మానవునియెడల దేవుని చిత్తము నెరిగి దానిని చేయవలెను (రోమా 10:17). అనగా దేవుని యందును, క్రీస్తు దేవుని కుమారుడని ఆయన యందును విశ్వాసముంచి (హెబ్రీ 11:6; యోహాను 14:1), పాపముల విషయమై మారుమనస్సు బొంది (అపో.కా. 17:30), క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని (రోమా 10:10), పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచబడము పొందవలెను (అపో.కా. 2:38). ప్రభువుయొక్క మరణ సమాధి పునరుత్థానములను చిత్రీకరించు క్రియ బాప్తిస్మము. అది ఒకని క్రీస్తులోనికి ఆయన ఆత్మీయ శరీరములోనికి ప్రవేశింప జేయునట్టిది. (గలతీ 3:26, 27; 1 కొరింథీ 12:13). అది ఒక క్రొత్త జన్మ (యోహాను 3:3-5). అది సమర్పణ జీవితంయొక్క నాంది.

క్రైస్తవుడగుటలోను, క్రైస్తవునిగా యుండుటలోను మతశాఖలవారికున్న భావనకంటె యెక్కువ యిమిడియున్నది. క్రైస్తవుడగుట యనగా క్రీస్తును ప్రభువని, రక్షకుడని అంగీకరించుటయే యని వారి భావం. సాధారణంగా వారొకసారి రక్షింపబడితే వారేమిచేసినను చేయకపోయినను, సంఘారాధనలకు హాజరైనను, హాజరుకాకపోయినను అంతమువరకు రక్షింపబడి యుందురని వారి ఉద్దేశ్యము, అయితే యిట్టిబోధను బైబిలు బోధించుటలేదు. బైబిలులో మనం చదువు క్రైస్తవ్యానికి యిది సుదూరముగా యున్నది. ఇటువంటి బోధ ననుసరించువారనేకులు గనుక యిది కొందరికి ఆశ్చర్యకరముగాను, మరి కొందరికి అసహ్యకరంగాను యున్నది. ఎందువలనంటె యిది కేవలం దేవదూషణయని కొందరు గ్రహించిరి. సరిగదా ఒకడు క్రైస్తవుడగుటకు క్రీస్తుబోధకు లోబడుటయేగాక క్రైస్తవునిగా యుండుట కతడు క్రీస్తు అడుగు జాడలలో నిలకడగా యుండవలెను.

ఏమియు చేయకుండ క్రైస్తవునిగా అంగీకరించ బడవలెనని కొందరు ఎట్లు కోరుదురో నాకు తెలియదు. పాపమునకు, ఈలోకమునకు

ఎంత సన్నిహితంగా జీవించగలమో యని ప్రయత్నించు వారినిగూర్చి నేను గ్రహించుకోలేకపోవు చున్నాను. ఈలోకసంబంధమైన వాటినే కొందరు ఎల్లప్పుడు యేల ఎంచుకొనుచున్నారు? అట్టివారే హిత బోధను నైతికసత్ప్రవర్తనను ఎల్లప్పుడు యేల వ్యతిరేకించుచున్నారు? నిజానికి అట్టివీరే బలహీనులు, మెత్తనివారు, ఈలోకానికి అంటకట్టుకొని క్రైస్తవ జీవితాన్ని జీవించుటకు ప్రయత్నించు చున్నవారని అర్థమగుచున్నది.

క్రీస్తుకు అతి సన్నిహితంగా నడువ ప్రయత్నించువాడు క్రైస్తవుడు. ప్రభువుకు ఎంత చేయగలడో అంత చేయవలెను, ఎంత ఈయగలడో అంత ఈయవలెను. తప్పుడు బోధలను, అవినీతిని ఈలోకాచారములను వ్యతిరేకించువాడతడు, అతడు మూఢభక్తి గలవాడుకాడు. అతడు క్రైస్తవుడు. అందునుగూర్చి సిగ్గుపడువాడుకాదు గాని అందరు తనవలె యుండాలని కోరేవాడు.

క్రీస్తుకు సమర్పించుకొనుట అంటే అర్థమేమిటి? దేవునివాక్యమును వినిన తరువాత దాని బోధను అందులోని షరతులను గ్రహించుకొనిన తరువాత అతడొక నిర్ణయానికి రావలెనని దానియర్థము. అంటే తాను వినిన దానిని హృదయ పూర్వకముగా అతడు విశ్వసించును. ప్రభువు తన వాక్యములో విధించిన షరతులకు లోబడుట కతడు ఆసక్తికలిగియుండును, యిష్టపడును. వీటికి లోబడిన తరువాత అతడు తన శరీర, హృదయాత్మలతో సంపూర్తిగ క్రైస్తవునిగ యుండుటకు ప్రయత్నించును. అతడు ప్రభువునకు ఆయన సువార్తకు సంపూర్తిగ అర్పించుకొనును. అతడొక సజీవ యాగమగును (రోమా 10:1, 2). అతడు ఈలోకానికి విచిత్రమైనవాడు, వేరైనవాడు (1 పేతురు 2:9). అతడు తన యజమానిని మాత్రమే సంతోష పరచగోరును. క్రీస్తుకు సమర్పించుకొనుట అనగా అర్థమిదియే.

క్రీస్తుకు సమర్పించుకొనుటనుగూర్చి కొందరు అత్యంతమైన స్థానమును గైకొందురు. వారు తమ కుటుంబమును, బంధువులను, సమస్తమును విసర్జించవలెనని యనుకొందురు. ప్రభువుకు ఒకసారి తాము సమర్పించుకొనినప్పుడు తమ తలిదండ్రులకొరకు, తమకుటుంబ సభ్యులకొరకు సమయాన్ని వినియోగించలేమని వారు సూచింతురు. ఈజీవితానికి అవసరమైన వాటిని కేవలము విసర్జించవలెనని బైబిలు చెప్పుటలేదు (లూకా 9:23). గాని ఏమైతే తప్పుడు సంగతులున్నవో వాటిని, క్రీస్తును వెంబడించుటలో అభ్యంతరము కలుగజేయువాటిని మనము విసర్జించవలెను. అదే సమయమందు మన కుటుంబ సభ్యులు మొదలైనవారు (లేక సంగతులు) ప్రభువును వెంబడించుటలో మనకు అభ్యంతరముగా యుండరు. ఆయన చిత్తాన్ని జరిగించుటలో వారొక అభ్యంతరముకాదు. గనుక వారిని విసర్జించుట మనకు అవసరము లేదు సరిగదా అట్లుచేయుట దోషము.

సమర్పణ వ్యక్తిగతమైనది. మనకొరకు వేరొకరు దానిని చేయ లేరు. దానినెవరు బలవంతముగా మనకు అప్పగించరు. సరిగదా అది లోపలినుండి రావలసినది. క్రీస్తు తనవాక్యములో సూచించిన బోధకు, సూత్రములకు, నిజంగా ఆయనకు మనము లోబడినప్పుడు, అప్పగించు కొన్నప్పుడు, నమ్మకముగా యున్నప్పుడు మనము సమర్పించుకొనిన వారమగుదుము.

నిన్ను నీవు ప్రభువుకు అప్పగించుకొన్నావా? నీవాయనకు లోబడితివా? ఆయన కొరకు ప్రతి దినము జీవించుచున్నావా? నీవు క్రీస్తుకు సమర్పించుకొన్నావా? అట్లయితే అది నీతత్వములోను, సంభాషణ లోను, ఆరాధనలోను, పనిలోను, నీ జీవితంలోను కనబడును. నీవు అప్పగించుకొనలేకపోతే అదికూడ కనబడును. మనస్సులేని క్రైస్తవ్యం, చల్లబడిన క్రైస్తవ్యం, క్రైస్తవ్యం కానేకాదు. దానివలన నీకు, ఇతరులకు దుఃఖమే కలుగును.

నీవు నీజీవితాన్ని గూర్చి ఆలోచించుకొనుము. ఒక క్రైస్తవుని వలె నీవు ఎక్కడికి పోవుచున్నావో గమనించుకొనుము. ప్రభువు కోరునట్టి క్రైస్తవునిగా నీవుండవలసినరీతిగా లేనియెడల క్రీస్తుకొరకు మరల నిన్ను నీవు సమర్పించుకో. ఆయన మాత్రమే ఈయగలిగిన మేళ్ళను ఆయననుండి పొందు. అట్లుచేయుటలో నీవు మార్పునొందుదువు, నీ జీవితమునకు ఒక నూతన భావమును కనుగొందువు. అదేసమయమందు నీవు యితరులకు దీవెనకరముగా యుందువు. నీవు క్రీస్తుకు, ఆయన రాజ్యముకు మహిమ, ఘనతలు కలుగ జేయుదువు.

నీవు క్రైస్తవుడవు కానియెడల బైబిలునందున్న పవిత్రక్రైస్తవ్యమును గమనించవలెనని నిన్ను కోరుచున్నాను. నీవు దాని బోధలకు లోబడినయెడల ప్రభువు నిన్ను రక్షించి తన సంఘమందు చేర్చుకొనును. అప్పుడు క్రైస్తవ్యముయొక్క యథార్థ భావమును నీవు కనుగొందువు. నీవు క్రైస్తవుడయ్యేవరకు నీవేమి కోల్పోవుచున్నావో నీకే తెలీదు.

---

## యేసును వెంబడించిన పండ్రెండుగురు-4
## యోహాను, క్రీస్తుప్రేమ ప్రచారకుడు

## *(John : Preacher of Christ's Love)*

యేసుతో సహవసించుటవలన తన జీవితమును సంపూర్తిగా మార్చుకొనినవాడు యోహానని మనము సాధారణముగా అనుకొందుము. దీనిని బలపరచుటకు మంచి ఋజువులున్నవి.

నాలుగవ సువార్తలో యోహాను పేరు మనకు కనబడదు. గాని పత్రికలలో అతడు తరచు కనబడును. మనం చూచే దృశ్యం అంత

ఆకర్షణీయంగా ఉండదు. అతడు అత్యాసక్తిగల అభిలాష పసునివలెను (మార్కు 10:35-45), చురుకైన కోపముగలవానిగను (లూకా 9:51-53), స్వల్ప సహనము, సంకుచితావగాహనము గలవానిగను మనకగుపడును (మార్కు 9:38-41).

అయినను యోహాను సువార్త, పత్రికలు వ్రాసేసరికి యేసుతో సంచరించి సంభాషించిన తన యవనకాల మానవునికంటె బహుగా మార్పుజెందిన వానిని మనము చూడగలము. తాను వ్రాసినట్టివి క్రీస్తు ఆరోహణుడైన అనేక సంవత్సరముల తరువాత, తన ప్రభువు చేసిన బోధలను తన జీవితంలో అలవరచుటకు ప్రయత్నించిన తరువాత వ్రాసెను. ప్రేమనుగూర్చి యేసు చెప్పినదానిని యోహాను ప్రత్యేకముగా గ్రహించుకొనెను. యేసుయొక్క పనియంతటికి ప్రేమ కేంద్రీకృతమైయున్నది. అందువలన యోహాను వ్రాతలు ప్రేమ ప్రభావితములాయెను.

"తన స్నేహితులకొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు" అని యేసు చెప్పెను (యోహాను 15:13). యేసు తన శిష్యులయెడల యిదేపనిని గావించెనని యోహాను సవిస్తరముగా తెలిసికొనెను. ప్రభువు శిష్యులు జీవించవలసిన విధము కూడా ఇదేనని, ఒండొరులయెడల త్యాగపూరితమైన ప్రేమ యుండవలెనని అతడు సవిస్తరముగా తెలిసికొనెను. దీనికి వేరేవిధముగా జీవించుట క్రీస్తు జీవితముయొక్క భావాన్ని గ్రహించుకొనుటలో విఫలమగుటయే. మానవులకు దేవుని చూపించుటకు క్రీస్తు వచ్చెను. అయితే మానవులు ప్రేమను చూచిరి–"దేవుడు ప్రేమయైయున్నాడు" (1 యోహాను 4:8). దేవుని యెరుగుట యనగా ప్రేమను ఎరుగుటయే. దేవునివలన జన్మించుట యనగా ప్రేమించుటయే. అందువలన ప్రేమించలేని శిష్యుడు స్వయం విరుద్ధుడు.

"మనము సహోదరులను ప్రేమించుచున్నాము గనుక మరణములోనుండి జీవములోనికి దాటియున్నామని యెరుగుదుము. ప్రేమ లేనివాడు మరణమందు నిలిచియున్నాడు" (1 యోహాను 3:14).

"ప్రియులారా, మనము ఒకనినొకడు ప్రేమింతము, ఏలయనగా ప్రేమ దేవునిమూలముగా కలుగుచున్నది, ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా పుట్టినవాడై దేవుని ఎరుగును. దేవుడు ప్రేమయై యున్నాడు. ప్రేమలేనివాడు దేవుని యెరుగడు" (1 యోహాను 4:7,8).

గలతీ పత్రికపై వ్యాఖ్యానము వ్రాస్తూ యోహానును గూర్చిన ఒక చక్కటి సంగతిని జెరోమ్ మనకు బయలు పరచెను. దేవుని ప్రేమ వలన యోహాను జీవితం ఎంతమట్టుకు నిండిపోయిందో అది మనకు తెలియ పరచుచున్నది. జెరోమ్ యిట్లు వ్రాసెను: "ఎఫెసులో యోహాను నివసించు చున్నప్పుడు వృద్ధాప్యమువలన తన శిష్యుల చేతులమీద కష్టముతో ఆరాధనకు మోసికొనిపోబడుచుండేవాడు. ఎక్కువ మాటలాడుటకు శక్తిలేనివాడై వారికూటము లన్నిటిలోను "చిన్నపిల్లలారా, ఒకని నొకడు ప్రేమించుడి" యని చెబుతూయుండే వాడు. ఆవేమాటలను పదే పదే వినుటవలన తన శిష్యులు, సంఘ తండ్రులు విసిగిపోయి అయ్యా, నీవు అస్తమానము ఎందుకలా చెబు తావు? అని అడిగారు. "యిది ప్రభువు ఆజ్ఞ. యిది ఒక్కటే నెరవేర్చిన యెడల అది చాలును" అని అతడు జవాబిచ్చాడు.

యోహాను జీవితంలో యేసుప్రేమ తీసుకొచ్చిన మార్పు అది. మన జీవితాల్లో అట్టిమార్పును అది తీసుకొని రాగలదు. క్రీస్తును తెలిసి కొనుట దేవుని ప్రేమను తెలిసికొనుటయే. ఆప్రేమను తెలిసికొనుట మార్పుచేసే శక్తిని తెలిసికొనుటయే.

"ప్రేమలేనివాడు మరణమందు నిలిచియున్నాడు. తన సహోద రుని ద్వేషించువాడు నరహంతకుడు, ఏనరహంతకుని యందును నిత్య జీవముండదని మీరెరుగుదురు. ఆయన మన నిమిత్తము తన ప్రాణము

పెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసి కొనుచున్నాము. మనముకూడ సహోదరులనిమిత్తము మన ప్రాణములనుపెట్ట బద్ధులమై యున్నాము......చిన్నపిల్లలారా, మాటతోను, నాలుకతోను కాక క్రియతోను, సత్యముతోను ప్రేమింతము" (1 యోహాను 3:14-18).

—L. M. మాంట్గోమరీ.

---

# నీ దేవుని ఎరుగుదువా?

దేవునిగూర్చి తెలుసుకొనుట వేరు, దేవుని ఎరుగుటవేరు. ప్రాచీనకాలంనుండి దేవునిగూర్చి తెలుసుకోవాలని మానవుడు అనేక మార్గాలు అన్వేషించాడు. గ్రీకులు, హైందవులు ఇంచుమించు ఒకే విధమైన అన్వేషణలు కొనసాగించారు. వాటిలో ధ్యానమార్గం, జ్ఞాన మార్గం మరియు యోగమార్గాలు ముఖ్యమయినవి.

"జ్ఞాని ఏమయ్యెను? శాస్త్రి యేమయ్యెను? ఈలోకపు తర్కవాది ఏమయ్యెను? ఈలోకజ్ఞానమును దేవుడు వెర్రితనముగా చేసి యున్నాడుగదా! దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవుని ఎరుగకుండెను" అంటుంది దివ్యగ్రంథం. (1 కొరింధి 1:20-21).

## వివిధ మతాలకు కారణం...?

మానవుడు అన్వేషించిన మార్గాల ఫలమే నేటి వేలాది మతాలు, భిన్నవిశ్వాసాలు, వేరు వేరు సిద్ధాంతాలు. అంతేకాదు, మానవుని అన్వేషణా ఫలితంగా వేలాది దేవుళ్లు దేవతలు కాల క్రమంలో వెలియసాగారు. ఎందరో దేవుళ్ళు, దేవతలు కాల ప్రవాహంలో కొట్టుకుపోయి మనుష్యుల స్మృతిపథంనుండి మరుగైపోయారు. ఎండమావులు నీళ్లు కావుకదా!

ప్రాచీనకాల మానవుని దృక్పథంలో తనకంటె శక్తిగల ప్రతీది దేవుడే. అందుకే గాలి, నీరు, నిప్పు, సూర్యుడు, చంద్రుడు మొదలగు ప్రకృతి శక్తులకు దైవత్వం ఆరోపించి వాటిని పూజించ సాగారు. అంతేకాదు, మశూచీ, స్ఫోటకంలాంటి శరీర రోగాలకు దేవత్వమారోపించి దేవతలుగా కొలిచారు. బైబిలు చెప్పినట్టు, "సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును సేవించి, పూజించిరి" (రోమా 1:18-23). ఆధునిక మానవుడు తన మూఢ విశ్వాసానికి వివిధ భాష్యాలతో మెరుగులుదిద్ది సమర్థించుకుంటూ ముసుగులో వుంటున్నాడు. ఇది విచారకరం!

ప్రకృతి శక్తులను రాయి రప్పలను, పశుపక్ష్యాదులను ఆరాధించువారు దేవుని ఎరుగలేదని వేరే చెప్పవలసిన అవసరం లేదు. కాని విగ్రహారాధికులలో చేరనివారై, నిజదేవుని నమ్మి "ఆయనను ఆరాధించువారంతా ఆయనను ఎరుగుదురా?"

"మీరు నన్నైనను, నా తండ్రినైనను ఎరుగరు"—ఇది యేసు క్రీస్తు తనకాలంలోని యూదులతో చెప్పినమాట. ఈమాట విన్న యూదులు కలవరపడ్డారు. క్రీస్తుపై రాళ్లు రువ్వా లనుకున్నారు. కారణం? ఆయన చెప్పినమాట ముమ్మాటికీ యధార్థం (యోహాను (8:54-59).

యూదులు దేవుని ప్రజలు, ఆయన ప్రత్యేకించుకొనిన ప్రజలు. ధర్మశాస్త్రం, అర్చనాచారాదులు, వాగ్దానములు వీరివి, పితరులు వీరివారు, శరీరమునుబట్టి క్రీస్తు వీరిలోపుట్టెను (రోమా 9:4-5). వీటన్నిటికన్నా ముఖ్యమయిన సంగతి – వారు దేవునియందు ఎక్కువ ఆసక్తిగలవారు (రోమా 10:1-2). అట్టివారే దేవుని ఎరుగలేదను సంగతి బహు విచారగ్రస్తం.

## క్రీస్తును ఎరుగుట అంటే....?

క్రీస్తును ఎరుగనందున వారు యెహోవాను ఎరుగలేదు (యోహాను 8:19). క్రీస్తును ఎరుగుట అంటే - ఆయన వంశం, గోత్రం, జన్మస్థలం, తలిదండ్రుల పేర్లు మొదలగు భౌతిక విషయాలు తెలుసుకోవటంకాదు. గాని ఆయన స్వభావలక్షణములు, వ్యక్తిత్వము నెరిగి ఆయనవలె జీవించటం, క్రీస్తు సారూప్యములోనికి మనం మార్చబడాలని దేవుని సంకల్పమై యున్నది (రోమా 8:28-30).

దేవుని ఎరుగు విధానం యోహాను తన మొదటి పత్రికలో వివరించాడు. అవి మూడు విధాలు. 1. ఆజ్ఞలు గైకొనుట. 2. పాపరహిత జీవితం, 3. ప్రేమ.

### ఆజ్ఞలు గైకొనుటద్వారా దేవుని ఎరుగుట

"మనము దేవుని ఆజ్ఞలను గైకొనిన యెడల, దీనివలననే ఆయనను ఎరిగి యున్నామని తెలిసికొందుము. ఆయనను ఎరిగియున్నానని చెప్పుకొనుచు ఆయన ఆజ్ఞలను గైకొననివాడు అబద్ధికుడు. వానిలో సత్యములేదు." ఆయన ఆజ్ఞలు గైకొనువారే ఆయనను ఎరుగుదురు (1 యోహాను 2:3-4).

దేవుని ఆజ్ఞలను ఎరుగనివారై మానవ పద్ధతులతో తండ్రిని ఆరాధించువారును, ఆయన ఆజ్ఞలను ఎరిగనివారై అలక్ష్యభావం చూపువారును ఒక్కటే. స్వనీతియను చెరనుండి మానవుడు పూర్తిగా బయట పడనిదే దేవుని ఆజ్ఞలకు పూర్తిగా విధేయుడు కాలేడు. మానవుడు కల్పించిన పద్ధతులు, పారంపర్య ఆచారములు దేవుని వాక్యమును నిరర్థకము చేయును (మత్తయి 15:6-9). దేవుని మాట వినుట బలులకన్నా శ్రేష్ఠం! (1 సమూ 15:22).

### పాపరహిత జీవితంద్వారా దేవుని ఎరుగుట

"ఆయనయందు నిలిచియుండు వాడెవడును పాపము చేయడు. పాపము చేయువాడెవడును ఆయనను చూడను లేదు. ఎరుగనులేదు" (1 యోహాను 3:6).

ఈ వచనంలో "పాపము చేయుట" అనగా గురిని తప్పినట్లు పాపములో కొనసాగుటయని భావం. క్రైస్తవుడు భౌతిక దేహంతో, మంచి చెడ్డల జ్ఞానం కలిగి జీవించి యున్నంత కాలం సంపూర్ణుడు కాడు. అయినను పాత జీవితంలో కొనసాగటం వేరు, పొరబడి తప్పుచేసి మారుమనస్సు పొందుట వేరు.

క్రైస్తవులనబడిన అనేకులను గూర్చి పౌలు ఇట్లు చెప్పుచున్నాడు. "దేవుని ఎరుగుదుమని వారు చెప్పుకొందురు కాని అసహ్యులును, అవిధేయులును, ప్రతిసత్కార్యము విషయము భ్రష్టులునై యుండి తమ క్రియలవలన ఆయనను (దేవుని) ఎరుగమన్నట్లున్నారు" (తీతు 1:16). మన క్రియలే మనం దేవుని ఎరిగినదీ, లేనిదీ నిర్ణయించును.

## ప్రేమద్వారా దేవుని ఎరుగుట

"దేవుడు ప్రేమాస్వరూపి, ప్రేమ లేనివాడు దేవుని ఎరుగడు" (1 యోహాను 4:7). అంతేకాదు, "ప్రేమ దేవుని మూలముగా కలుగుచున్నది. ప్రేమించు ప్రతివాడు దేవుని మూలముగా పుట్టినవాడై దేవుని ఎరుగును" (1 యోహాను 4:7).

దేవుని ప్రేమను గ్రీకుభాషలో "అగాపే" అంటారు. అంటే శత్రువునుసహా ప్రేమించటం. అది కుమారునిపట్ల ఒక తండ్రి చూపించే ప్రేమలాంటిది.

ఇట్టి ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. మత్సరపడదు, డంబముగా ప్రవర్తింపదు, ఉప్పొంగదు, అమర్యాదగా నడువదు, స్వప్రయోజనమును విచారించుకొనదు, త్వరగా కోపపడదు, అపకారమును మనస్సులో వుంచుకొనదు, దుర్నీతివిషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును, అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును, అన్నిటిని నిరీక్షించును, అన్నిటిని ఓర్చును (1 కొరింథి 13 : 4-7).

ప్రేమతోకూడిన క్రియలద్వారానే దేవుని యెరుగ గలము. రాజైన యోషీయాను గూర్చి యెహోవా వాక్కు ఇట్లు పలుకు చున్నది. "అతడు దీనులకును, దరిద్రులకును న్యాయము తీర్చుచు సుఖముగా బ్రతికెను. అలాగు చేయుటే నన్ను (దేవుని) తెలుసుకొనుట కాదా ?" (యిర్మీయా 22:16). ప్రేమ సర్వాంగ హోమములన్నిటి కంటే, బలులుకంటే ఎంతో అధికం (మార్కు 12:33).

## దేవుని చాటుచున్న సృష్టి

సహోదరులారా! స్నేహితులారా! సృష్టియావత్తు దేవుని అదృశ్య లక్షణములను చాటుచున్నది (రోమా 1:20). సౌరకుటుంబం, పాలపుంత, గేలాక్సీ, నెబ్యులాలు దేవుని మహిమను వివరించుచున్నవి (కీర్త 19:1-4). తొలకరి వానలు, ఫలవంతమైన ఋతువులు ఆయనను గూర్చి సాక్ష్య మిచ్చుచున్నవి (యిర్మీయా 5:24, అ. కార్య. 14:17). మృగములు, ఆకాశపక్షులు, భూమి ఆయనను గూర్చి బోధించు చున్నవి (యోబు 12:7-9). సెలయేటి గలగలలు, సముద్ర కెరటాలు ఆయనను గూర్చి పాడుచున్నవి (యిర్మీయా 5:22). వీటిద్వారా దేవుని శక్తిని ఎరుగగలము. కాని ఆయన వ్యక్తిత్వమును క్రీస్తుద్వారా మాత్రమే ఎరుగగలము.

## దేవుని బయలుపరచిన క్రీస్తు

క్రీస్తు అదృశ్య దేవుని స్వరూపి, ఆది సంభూతుడు (కొలస్స 1:16). ఆయనే దేవుని మహిమ యొక్క తేజస్సు, ప్రతిబింబము, ఆయన తత్వముయొక్క మూర్తిమంతము (హెబ్రీ 1:3-4). ఆయనే మార్గము, సత్యము, జీవము, ఆయనద్వారానే తప్ప ఎవరును తండ్రి యొద్దకు చేర లేరు (యోహాను 14:6). అద్వితీయుడైన సత్య దేవుని, ఆయన కుమారుడైన క్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము (యోహాను 17:3).

శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందుతున్నకొలదీ మానవుడు దేవునికి మరింత సన్నిహితుడు కావాలి. అలా కాకపోతే అది వెర్రి విజ్ఞానమే ఔతుంది.

దేవుని సృష్టిద్వారా ఆయన ఉనికి, నిత్యశక్తి, అదృశ్య లక్షణములు ఎరుగుదము. ఆయన కుమారుడైన క్రీస్తుద్వారా ఆయన వ్యక్తిత్వమును, స్వభావ లక్షణములను ఎరుగుదము. క్రీస్తు సారూప్యములోనికి దినదినము రూపాంతరం చెందుతూ దేవుని ఎరుగు కార్యక్రమములో కొనసాగుదము. మానవులంతా దేవుని గూర్చిన జ్ఞానముగలవారు కావలెనని దేవుడు కోరుచున్నాడు (1 తిమో 2:4). నీ దేవుని ఎరుగుదువా?

—సత్యానందం, రాజమండ్రి.

---

## యుద్ధాయుధములు
### (*Weapons of Warfare*)

యెషయా 2:2, 3 లో యున్న ప్రవచనమును, దాని నెరవేర్పును యెరుగని క్రీస్తుసంఘ బోధకులు యెవరును ఉండరు. సంఘస్థాపన మాత్రమే కాదు గాని 'సంఘపు జీవన విధానము' కూడా ప్రవచింపబడెను. "ఆయన మధ్యవర్తియై అన్యజనులకు న్యాయము తీర్చును; అనేక జనులకు తీర్పు తీర్చును. వారు తమ ఖడ్గములను నాగటి నక్కులుగాను, తమ ఈటెలను మచ్చుకత్తులుగాను సాగ గొట్టుదురు. జనము మీదికి జనము ఖడ్గమెత్తక యుండును. యుద్ధము చేయ నేర్చుకొనుట ఇక మానివేయును" (యెషయా 2:4). అంతవరకు మరణాయుధములుగా ఉపయోగించిన ఖడ్గములు పొలము పనికి, ఈటెలు కొమ్మలు నరుకు కత్తులుగాను మార్చివేయబడెను. గనుకనే "సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు" యని యేసుబోధించెను (మత్తయి 5:21, 22; 1 యోహాను 3:15).

# మృగత్వము నుండి మృదుత్వము

"తోడేలు గొఱ్ఱెపిల్ల యొద్ద వాసము చేయును. చిఱుతపులి మేక పిల్ల యొద్ద పండుకొనును. దూడయు కొదమసింహమును పెంచబడిన కోడెయు కూడగా బాలుడు వాటిని తోలును. ఆవులు ఎలుగులు కూడి మేయును. వాటి పిల్లలు ఒక్క చోటనే పండుకొనును. ఎద్దు మేయు నట్లు సింహము గడ్డి మేయును. పాలుకుడుచు పిల్ల నాగుపాము పుట్ట యొద్ద ఆట్లాడును. మిడినాగు పుట్టమీద పాలు విడిచిన పిల్ల తన చెయ్యి చాచును. 'నా పరిశుద్ధ పర్వతమందంతటను' ఏ మృగమును హానిచేయదు; నాశనము చేయదు" (యెషయా 11:6-9). "తోడే ళ్లును సింహమును కలిసి మేయును, సింహము ఎద్దువలె గడ్డి తినును. సర్పమునకు మన్నే ఆహారము. 'నా పరిశుద్ధ పర్వతములో' అవి హాని యైనను నాశనమైనను చేయకుండును" (యెషయా 65:25). అనగా "ఒకని నొకడు ప్రేమించుట విషయములో తప్ప మరేమియు ఎవనికి అచ్చి యుండవద్దు. పొరుగువానిని ప్రేమించువాడే ధర్మశాస్త్రము నెరవేర్చువాడు" (రోమా 13 : 8). రక్షింపబడక మునుపు వారు యెలాంటి స్వభావము కల్గియున్నను, మార్పు నొందిన జీవనము తరు వాత సాధుత్వము కలిగి ఐక్యతతో క్రీస్తునందు సాగించవలెనని ఈ ప్రవచనములు బోధించుచున్నవి. యెషయా చెప్పిన క్రూరజంతువు లన్నియు మానవులయొక్క దుష్ట స్వభావములకు సాదృశ్యములుగా నున్నవి. ప్రకృతి యందలి మృగములు అట్టి పొత్తును కల్గియుండుట అసంభవము. గనుక ఆ పదములన్నియు అలంకార రీతిగా వాడబడె నని గ్రహింపనగును. "నూతన హృదయమును మీ కిచ్చెదను, నూతన స్వభావము మీకు కలుగజేసెదను, రాతిగుండె మీలోనుండి తీసివేసి మాంసపు గుండెను మీ కిచ్చెదను" (యెహెజ్కేలు 36:26). కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే, మోసకరమైన దురాశలవలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదలుకొని మీ చిత్తవృత్తి

యందు నూతన పరచబడినవారై, నీతియు యథార్థమైన భక్తియు గలవారై దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొన వలెను" (ఎఫెసీ 4:22-24). మృగ స్వభావమును విడిచి మారుమనస్సు నొందిన వారికి మాత్రమే క్రీస్తుయొక్క సంఘములో స్థాన మున్నది.

పరాక్రమశాలికంటె దీర్ఘశాంతముగలవాడు శ్రేష్ఠుడు. పట్టణము పట్టుకొను వానికంటె తన మనస్సును స్వాధీనపరచు కొనువాడు శ్రేష్ఠుడు (సామెతలు 16:35). ప్రాణములేక పాడై పోవు పురము యెంతో తన మనస్సును అణచుకొనలేని వాడును అంతే (సామెతలు 25:28). అహంకారముగల వానికంటె శాంతముగలవాడు శ్రేష్ఠుడు (ప్రసంగి 3:8). పౌలిట్లనుచున్నాడు: "మేము శరీరధారులమై నడచు కొనుచున్నను శరీరప్రకారము యుద్ధము చేయము. మా యుద్ధోపకరణములు శరీర సంబంధమైనవికావు గాని, దేవుని యెదుట దుర్గములను పడద్రోయ జాలినంత బలముగలవై యున్నవి" (2 కొరింథి 10:3, 4). యుద్ధాయుధములకంటే జ్ఞానము శ్రేష్ఠము. ఒక పాపాత్ముడు అనేకమైన మంచిపనులను చెరుపును (ప్రసంగి 9:18). అట్లయితే జ్ఞాన మెట్లు వచ్చును? "దేవునియందలి భయభక్తులే జ్ఞానమనియు, దుష్టత్వము విడుచుటయే వివేకమనియు ఆయన నరులకు సెలవిచ్చుచున్నాడు" (యోబు 28:28). గనుక దేవుని రాజ్యము (సంఘము) శారీరక యుద్ధమును కలహమును కాదుగాని నీతియు సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది (రోమా 14:17). కాబట్టి సమాధానమును, పరస్పర క్షేమాభివృద్ధిని కలుగజేయువాటినే వెంటాడుదము.

—ప్రభుదాస్ సబ్బతి.

---

క్రీస్తుసంఘముల 'సత్య వాణి' రేడియో కార్యక్రమమును ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శని వారాల్లో మధ్యాహ్నం 2-30 గంటలకు రేడియో శ్రీలంక ద్వారా వినండి. మీ మిత్రులకు వినిపించండి!!

# ప్రభు రాత్రిభోజనము యేమై యున్నది?

## (*What is the Lord's Supper?*)

కొరింథు పట్టణములోని క్రైస్తవులకు పౌలు తన మొదటి పత్రికలో ఇట్లు బోధించెను: "నేను మీకు అప్పగించిన దానిని ప్రభువు వలన పొందితిని. ప్రభువైన యేసు తాను అప్పగించబడిన రాత్రి యొక రొట్టెను ఎత్తుకొని కృతజ్ఞతా స్తుతులు చెల్లించి దానిని విరిచి-యిది మీకొరకైన నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. ఆప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను ఎత్తికొని - యీపాత్ర నా రక్తము వలననైన క్రొత్తనిబంధన; మీరు దీనిలోనిది త్రాగునప్పుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. మీరు ఈరొట్టెను తిని, ఈ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు" (1 కొరింథి 11:23-26). కొరింథులోని క్రైస్తవులు ప్రభు రాత్రి భోజనమును స్వార్థముకొరకైన విందుగాచేసి దుర్వినియోగము చేయుచుండిరి. అందువలన పౌలు వారిని ఇట్లు హెచ్చరించెను: "కాబట్టి యెవడు అయోగ్యముగా ప్రభువుయొక్క రొట్టెను తినునో లేక ఆయన పాత్రలోనిది త్రాగునో వాడు ప్రభువు యొక్క శరీరమును గూర్చియు రక్తమును గూర్చియు అపరాధి యగును. కాబట్టి ప్రతి మనుష్యుడు తన్నుతాను పరీక్షించుకొనవలెను. ఆలాగుచేసి ఆరొట్టెను తిని ఆపాత్రలోనిది త్రాగవలెను. ప్రభువు శరీరమని వివేచింపక తిని త్రాగువాడు తనకు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు" (1 కొరింథి 11:27-29). అనేకసార్లు జరిగే రీతిగా అజ్ఞానము వలన వారు దానిని దుర్వినియోగపరచిరి. ప్రభు రాత్రిభోజన మేమై యున్నదో దాని భావమేమిటో వారు గ్రహింపలేక పోయిరి.

**అపౌక జ్ఞాపకార్థము:** ప్రభురాత్రి భోజనములో రెండు అంశము లుండును. అవి: 1) పులియని రొట్టె. ఇది పులియనిపిండితో

చేయబడిన పొంగని రొట్టె. ఈరొట్టె క్రీస్తు శరీరమునకు గుర్తు (మత్త 26:26). 2. ద్రాక్షారసము. యిది ద్రాక్షపండ్ల రసము. క్రీస్తు సిలువపై చిందిన రక్తమునకు గుర్తు యిది (మత్త 26:28). క్రైస్త వుడు ఈ రొట్టెను తిని ఈ ద్రాక్షారసమును త్రాగునప్పుడు అతని తలంపులు సిలువపై కేంద్రీకరించ బడవలెను. అతడు ప్రభువు యొక్క అద్భుతమైన జననమును, జీవనమును ముఖ్యముగా ఆయన మరణమును ఆలోచించుకొనవలెను. క్రైస్తవులు ప్రభు రాత్రి భోజనములో పాలు పొందునప్పుడు తమ తలంపులు క్రీస్తుపై కేంద్రీకృత మగునట్లు చూచు కొనవలెను.

అది విధేయత చూపు ఒక క్రియ: ప్రతివాడు దేవుని చిత్తమునకు ఆయన పాలనకు విధేయుడు కావలెను. అనగా దేవుని ఆజ్ఞలన్నిటికి విధేయుడు కావలెను. తన బిడ్డలు ప్రభురాత్రిభోజన మందు పాల్గొనవలెననునది దేవు డాజ్ఞాపించిన ఒక సంగతి. బైబిలు నందలి క్రైస్తవులవలె మనం ప్రతి ఆదివారమున ప్రభు రాత్రి భోజ నమందు పాల్గొనునట్లు సమావేశము కావలెను: "ఆది వారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు...,(అపొ. కా. 20:7). అట్లు చేయుటకు నిర్లక్ష్యముచూపినా లేక నిరాకరించినా సర్వశక్తిగల దేవుని ఎదురించినట్లగును. ఈవిషయములోను, అన్ని విషయములలోను మనం దేవునికి విధేయులగుటకు నిర్ణయించుకొందుము గాక.

అది ఒక ప్రచురణ: "మీరు ఈ రొట్టెను తిని, యీ పాత్ర లోనిది త్రాగునపుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు" (1 కొరింథీ 11:26). ప్రభు రాత్రి భోజనములో పాలు పొందునప్పుడు ప్రభువు యొక్క మరణమును గూర్చియు, దాని భావమును గూర్చియు మనము ప్రజలకు బహిరంగముగా జ్ఞాపకము చేతుము. మనలను పాపము నుండి విడిపించుటకు ఆయన తన ప్రాణ మును ధారపోసెను (మత్త 26:28). క్రీస్తు మరణములో నున్న రక్షణ

శక్తిని గూర్చిన మన విశ్వాసాన్ని ప్రకటించే ఒక మార్గము ప్రభు రాత్రి భోజనము.

**అది నిరీక్షించే ఒక క్రియ : 'ఆయన వచ్చువరకు'** మనం ఆయన మరణాన్ని జ్ఞాపకముంచుకొందుము. ప్రభు రాత్రి భోజనంలో పాల్గొనునప్పుడు మన తలంపులు వెనుకనున్న సిలువయొద్దకే గాక రాబోవుచున్న క్రీస్తు రెండవరాకడ యొద్దకు పయనించును. 1 థెస్స 4:16-18లో కనబడు మాటలతో మరియొకసారి ఆదరణపొందే మంచి అవకాశము, ప్రభురాత్రిభోజనము : "ఆర్భాటముతోను ప్రధానదూత శబ్దముతోను దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగి వచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆమీదట సజీవులమై నిలిచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతోకూడ ఉందుము. కాబట్టి మీరు ఈమాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి".

**అది పరీక్షించుకొనే సమయము :** "కాబట్టి యెవడు అయోగ్యముగా ప్రభువు యొక్క రొట్టెను తినునో లేక ఆయన పాత్రలోనిది త్రాగునోవాడు ప్రభువుయొక్క శరీరమునుగూర్చియు, రక్తమును గూర్చియు అపరాధి యగును. కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించుకొన వలెను; ఆలాగుచేసి ఆరొట్టెను తిని ఆ పాత్రలోనిది త్రాగ వలెను. ప్రభువు శరీరమని వివేచింపక తిని త్రాగువాడు తనకు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు" (1 కొరింథీ 11:27-29). ఈ వచనాల్లో ప్రభు రాత్రిభోజనంలో పాల్గొనేవాని యోగ్యత, అయోగ్యతలను గూర్చి పౌలు చర్చించుట లేదు. గాని ఒకడు పాల్గొనే విధం యొక్క యోగ్యత, అయోగ్యతలను గూర్చి అతడు చెప్పెను. ప్రభు రాత్రిభోజనములో అయోగ్యముగా పాల్గొనుట ఒక తీవ్రమైన సంగతి. గనుక దానిలో యోగ్యమైన రీతిగా పాల్గొనునట్లు ఆ రొట్టె

ద్రాక్షారసముల యొక్క భావమును మానసికంగా మనం యెరిగిన వారమై యుండాలి. మనము కల్వరి ఘట్టమును యోచించుచూ యుండాలి. ఆచారకర్మగా గాక దానిలో నిష్కపటమైన హృదయంతో పాల్గొనాలి. మనంచేయుదానిని ఎరిగియుండాలి. మనలను పాపమునుండి రక్షించుటకు క్రీస్తు తన శరీర రక్తముల నర్పించెను గనుక ఆయనను మనం ప్రేమించాలి. అందువలన మనం ప్రభు రాత్రి భోజనంలో పాల్గొనేటప్పుడు దానిని యోగ్యంగా ఆచరించేలాగున మన హృదయాన్ని మనమే పరీక్షించుకోవాలి.

అదొక సహవాస క్రియ :—మత్తయి 26:29 లో యేసు ఇట్లనెను : "నా తండ్రి రాజ్యములో మీతోకూడ నేను ఈ ద్రాక్షారసము క్రొత్తదిగా త్రాగు దినమువరకు ఇకను దానిని త్రాగనని మీతో చెప్పుచున్నాను." దేవుని రాజ్యమే క్రీస్తు సంఘము. అది పందొమ్మిది శతాబ్దముల క్రితమే అపొ. కా. 2 లో స్థాపించబడెను. లవొదికయలో యేసు నుండి తొలగిపోయిన క్రైస్తవులను అపొ. యోహానుద్వారా ఆయన యిట్లు హెచ్చరించెను : "ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల, నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతోకూడ అతడును భోజనము చేయుదుము" (ప్రకటన 3:20). ప్రభు రాత్రి భోజనంలో పాల్గొనేటప్పుడు మనం క్రీస్తుతో సంభాషించుచున్నామని, సహవసించుచున్నామని ఎరిగి యుండవలెను. ఈ అంశమును మనం సరిగ గ్రహించుకొనిన యెడల మన తోటి క్రైస్తవులకు, దేవునికికూడ మనం సన్నిహితులగుటకు ప్రభు రాత్రి భోజనం సహాయకారి యగును. నిజానికి మనం మన తండ్రి బల్ల చుట్టు గుమిగూడిన కుటుంబముగా యుందుము (1 కొరింథీ 10:21 చూడండి).

ప్రభు రాత్రి భోజనము భూమిమీద క్రీస్తు సంఘ చరిత్రనంతటినీ కలుపుచున్న వంతెనలాంటిది. ఆవంతెన ఒక చివర క్రీస్తు సిలువ

మరణముపై ఆధారపడి యున్నది. దాని రెండవచివర ఆయన మహిమ గల రెండో రాకడపై ఆధారపడి యున్నది. ప్రభు రాత్రి భోజనము యొక్క ప్రాముఖ్యతను దృఢముగా మనం యెరుగు లాగున దేవుడు సహాయం చేయునుగాక!

—రోజర్ ఫిఫ్రలెట్ (IGT)

---

## నరకంలో ఉండేది యెవరెవరు?

### (*Who's who in Hell*)

నరకంలో యెవరెవరు ఉంటారో వారి జాబితాను అపవాది తయారుచేసి యుంచాడని మీకు తెలుసా? ప్రకటన 21:8 లో ఈ జాబితా మనకు కనబడును: "పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికు లందరును అగ్నిగంధకములతో మండుగుండములో పాలుపొందుదురు; ఇది రెండవ మరణము". ఈజాబితా నొక్కమారు చూసేసరికి మనం అందులో లేమని మీరనుకొనవచ్చును. గాని ఇంకొక్కమారు చూడండి జాగ్రత్తగా!

**పిరికివారు :** మొదటిగా పిరికివారు మనకు కనబడుచున్నారు. పిరికివాడంటే, పిరికిపంద, ధైర్యంలేనివాడు, భయపడువాడని ఆ మాట యొక్క అర్థము. మొదటి శతాబ్దపు ఆఖరిభాగంలో తీవ్రమైన హింసల ద్వారా క్రైస్తవులు పరీక్షింపబడిరి. కైసరే ప్రభువని దేవుడని ప్రజలచే బలవంతముగా ఆరోజుల్లో ఒప్పించుచు క్రీస్తును కాదనిపించే వారు. "సహించిన వారమైతే ఆయనతో కూడ ఏలుదుము. ఆయనను ఎరుగమంటే మనలను ఆయన యెరుగనను" అని 2 తిమో 2:12లో అపొ. పౌలు వ్రాసెను. మొదటి శతాబ్దపు క్రైస్తవులలో క్రీస్తుకొరకు

నిలబడలేనట్టి పిరికివారనేకులుండిరి. క్రైస్తవుడొక సైనికునిగా, అతనిది సైనిక జీవితంగా లేఖనాల్లో వర్ణించబడింది. 2 తిమో 2:3,4 లో పౌలు ఇట్లనెను: "క్రీస్తు యేసుయొక్క మంచిసైనికునివలె నాతోకూడ శ్రమను అనుభవించుము. సైనికుడెవడును యుద్ధమునకు పోవునప్పుడు తన్ను దండులో చేర్చుకొనిన వానిని సంతోషపెట్టవలెనని యీ జీవన వ్యాపారములలో చిక్కుకొనడు". యేసును వెంబడించు వారందరు యుద్ధరంగములో ప్రథమపంక్తిలో యుండాలని ఆయన కాంక్షించుచున్నాడు. ఆయన ప్రజలు ప్రేక్షకులుగా కాదు గాని, రంగములో యుండాలని ఆయన కోరుచున్నాడు. నీవెక్కడ ఉన్నావు?

**అవిశ్వాసులు:** అవిశ్వాసులు అనగా విశ్వాసము లేనివారు, అపవాది జాబితాలో మనకు కనబడుచున్నారు. దేవతార్చన చేయుచు క్రీస్తుయెడల విశ్వాసము లేనివానికి యిది తప్పక వర్తించును. అయితే విశ్వాసము లేని క్రైస్తవులకుకూడ యిది వర్తించును. 'పైకి భక్తిగల వారై యుండియు దాని శక్తిని ఆశ్రయించనివారు" వీరే యని పౌలుతో మనం ఏకీభవించిక తప్పదు (2 తిమో 3:5). యుద్ధభూమిలోనికి దిగి పోరాడుమని యేసు చెబుతుంటే వారు మేమట్లు చేయలేమందురు. వారికి క్రీస్తునందు విశ్వాసములేదు. యిది నిన్ను వర్ణించుచున్నదా?

**అసహ్యులు:** మూడవదిగా అసహ్యులు మన కగుపడుచున్నారు. అసహ్యులంటే నిషిద్ధమైనవారు. నిషిద్ధమైనదేదయినను పరలోకములో ప్రవేశింపదని యోహాను వ్రాసెను (ప్రకటన 21:27). పరిశుద్ధాత్ముడు యాకోబు ద్వారా ఇట్లు పలికెను: "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును, నిష్కళంకమైన భక్తియేదనగా......ఇహలోక మాలిన్యము తనకంటకుండ తన్నుతాను కాపాడుకొనుటయునే" (యాకోబు 1:27). నీవస్త్రములకు పాపము అంటుకోకుండాయున్నదా?

**నరహంతకులు:** నాల్గవదిగా నరహంతకులు నరకమునకు పోయేవారి జాబితాలో కనబడుచున్నారు. నేనెవరిని హత్యచేయను,

చేయలేను అని నీవనుకొనుచున్నావు. గాని 1 యోహాను 3:15 లో ఇట్లున్నది: "తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు; ఏ నరహంతకుని యందును నిత్యజీవముండదని మీరెరుగుదురు". నీవు ఎవరినైనా ద్వేషించుచున్నావా?

**వ్యభిచారులు:** అపవాది లిస్టులో అయిదవ కేటగిరీ వ్యభిచారులు. వివాహానికి వెలుపలగల లైంగిక సంబంధాన్ని ఈపదం వర్ణించుచున్నది. అయితే నేను ఖచ్చితంగా ఈవిషయంలో అపరాధిని కాను అని నీవనుకొనుచున్నావు. "నేను మీతో చెప్పిన దేమనగా - ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును" అని యేసు చెప్పుచున్నాడు (మత్తయి 5:28).

**మాంత్రికులు:** తరువాత మాంత్రికులు మన కగుపడుచున్నారు. మాంత్రికుడనగా ఇంద్రజాలము చేయువాడు, మందులను దుర్వినియోగం చేయువాడని అర్థము. ఈనాడు అమ్మబడుచున్న అనేకరకములైన మత్తుమందులకు బానిసలై పోయినవారు, తమప్రాణములను కోల్పోయినవారు పెక్కుమంది ఉన్నారు. గనుక ఈ తరగతిలో అనేకులుంటారని మనం అనుకోక తప్పదు.

**విగ్రహారాధకులు:** క్రైస్తవుల మని చెప్పుకొనే వారిలో అనేకులు ఇంకను విగ్రహాల యెదుట వంగుచున్నారు. ధనాపేక్ష లేక లోభత్వము విగ్రహారాధనే యని కొలస్స 3:5 లో పౌలు వ్రాసెను. అవును, దురాశ, ధనాపేక్ష యను వేషముతో విగ్రహారాధన మనలో ఇంకా వున్నది. నీవు విగ్రహారాధకుడవా?

**అబద్ధికులు:** ఇది అపవాది జాబితాలో ఆఖరిమాట. "అబద్ధమాడు పెదవులు యెహోవాకు హేయములు" అని సామె 12:22 లో వ్రాయబడి యున్నది. మన నాలుకతోనే కాదు మన జీవితాలతోనే మనం అబద్ధము లాడుదుము. తీతు 1:16 ఇట్లనుచున్నది: "దేవుని

ఎరుగుదుమని వారు చెప్పుకొందురుగాని ... తమ క్రియలవలన ఆయ
నను ఎరుగనట్టున్నారు". నీవు అబద్ధికుడవా?

పైన చెప్పబడిన వారందరును అపవాది జాబితాలో ప్రముఖులే.
వారు అపవాదితో సహా నిత్యనరకం అనుభవింతురు. ఈజాబితాలో
పడకుండ నీకు నీవే జాగ్రత్తపడు !! —జాన్ స్టేసీ.

---

## జీ వ పు మా ట లు
## (Words of Life)

నీకు నిత్యజీవము దొరుకునని యనుకొనుచుండగా నీవు చని
పోయి నరకాగ్నికిపోతే ?! (లూకా 16:22-23), అనేకులు పరలోకా
నికి పోరని యేసు చెప్పెను: "ఇరుకుద్వారమున ప్రవేశించుడి; నాశన-
మునకుపోవు ద్వారము వెడల్పును, ఆదారి విశాలమునై యున్నది.
దానిద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము
ఇరుకును ఆదారి సంకుచితమునై యున్నది. దానిని కనుగొనువారు
కొందరే" (మత్త 7:13, 14).

మేము రక్షింపబడితిమని చాలమంది అనుకొందురు. గాని వారి
భావములను పరిశుద్ధప్రమాణమైన బైబిలుతో పోల్చిచూచినప్పుడు దేవుని
నుండి వారికేవిధమైన నిర్ధారణ దొరుకదు. "క్రైస్తవుడు అవ్వాలంటే
యేమిచేయాలో బైబిలు చెబుతుందని నాకు తెలుసు. గాని నేను రక్షింప
బడ్డానని నా హృదయం నాకు చెబుతుంది. నేను పరలోకానికి వెళ్ళ
లేనని నీవు చెప్పజాలవు" అని చెప్పేవారు చాలమంది యున్నారు. అది
చాల విచారం. సరిగ్గా యిటువంటి మన స్తత్వముగల వారితోనే యేసు
ఒకసారి మాటలాడెను. ఆయన చెప్పిందేమిటో గమనించుము :
"ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్య
ములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నాతండ్రి చిత్తప్రకారము
చేయువారే ప్రవేశింతురు. ఆదినమందు అనేకులు నన్ను చూచి

ప్రభువా, ప్రభువా మేము నీనామమున ప్రవచింపలేదా? నీనామమున దయ్యములను వెళ్లగొట్టలేదా? నీనామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు - నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నాయొద్దనుండి పొండని వారితో చెప్పుదును" (మత్త 7:21-23). ఆదినమందు అనేకులు సత్కార్యములను చేసినట్లు చెప్పుకొన జూతురు గాని నేను మిమ్మును ఎన్నడు ఎరుగను అని ఆయన వారికి చెప్పును. నేను మిమ్మును ఎన్నడు ఎరుగనను మాటలో అసంఖ్యాకులైన ఆ ప్రజలు ప్రభువు చిత్తమును ఎన్నడు సరిగ జరిగించలేదని అందువలన వారి సేవ వ్యర్థమని అర్థమగుచున్నది.

రక్షణను గూర్చిన సత్యమును సహృదయులైన వారెందరో వెదకు చున్నారు. మరికొందరయితే ఆసత్యమును లేఖనములలో వెదుకవలెననిగాని, వాటిని బట్టి వారు ప్రభువుకు సరిగా లోబడిరో లేదో యని నిర్ణయించుకొనాలనిగాని యెరిగినట్టులేరు. ★

---


## కీర్తన పుస్తకములు

మీ కుటుంబ, సంఘారాధనలలో చక్కగా పాటలుపాడి దేవుని స్తుతించుటకు వీలుగా యుండుటకు ఒక చక్కని కీర్తనల పుస్తకము తయారు చేయబడినది. దానిలో 231 పాత క్రొత్త కీర్తనలు పొందుపరుపబడి చక్కగా బైండింగ్ చేయబడినది.

ఫుల్ క్లాత్ బైండింగ్ పుస్తకము ఖరీదు రూ. 5-50

సగం క్లాత్ బైండింగ్ పుస్తకము ఖరీదు రూ. 4-00

పోస్టేజి అదనం. కీర్తనల పుస్తకములను V.P.P. ద్వారా కూడా పొందవచ్చును. వలయువారు ఈదిగువ చిరునామాకు ఈనాడే వ్రాయుండి.

**SATYA VANI**
Seshagiri Rao Street,
Ramaraopet, KAKINADA-533 004.

# క్రీస్తవుడు వెలుగై యున్నాడు

యేసు తన శిష్యులతో ఇట్లు చెప్పెను: "మీరు లోకమునకు వెలుగై యున్నారు. కొండమీద నుండు పట్టణము మరుగై యుండనేరదు. మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రింద పెట్టరుకాని అది యింట నుండువారి కందరికి వెలుగిచ్చుటకై దీపస్తంభము మీదనే పెట్టుదురు" (మత్తయి 5:14-15).

క్రీస్తును అనుసరించే మనకున్న గొప్పతనమును గూర్చి ఆయన చెప్పెను. "నేను ఈలోకములో ఉన్నప్పుడు లోకమునకు వెలుగునని చెప్పెను" (యోహాను 9:5). ఆయన లోకమునకు వెలుగై యున్న ప్రకారము ఆయనను వెంబడించుచున్న మనము ఆయనను పోలి యుండవలెను.

"అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసురక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7). కొండమీద నుండు పట్టణము మరుగై యుండదు గనుక ఆయన బిడ్డలమైన మనలో నున్న వెలుగును ప్రకాశింప జేయవలెను. అప్పుడు పరలోకమందున్న తండ్రి మహిమ పరచబడును (మత్తయి 5:16).

ఒకడు వెలుగు సంబంధినని చెప్పుకొనుచు చీకటి క్రియలలో పాలివాడైన యెడల అతడు అబద్ధికుడగుచున్నాడు. పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధికులును, అబద్ధికులందరును అగ్నిగంధకములతో మండు గుండములో పాలుపొందుదురు (ప్రకటన 21:8).

వెలుగు సత్యమును, పవిత్రతయను జ్ఞానమును సూచించుచున్నది. కనుక క్రైస్తవుడు తన బోధను, మాదిరినిబట్టి అజ్ఞానమును అంధకారమును తొలగించి జీవమార్గమును బయలుపరచుటకు అన్వేషించవలెను.

సమస్తమును ఖండింపబడి వెలుగుచేత ప్రత్యక్ష పరచబడును; ప్రత్యక్షపరచునది ఏదో అది వెలుగేగదా. అందుచేత నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలో నుండి లెమ్ము. క్రీస్తు నీమీద ప్రకాశించునని ఆయన చెప్పుచున్నాడు (ఎఫెసీ 5:13–14).

**వెలుగు ఫలములు :**–వెలుగు ఫలము సమస్త విధములైన మంచితనము, నీతి సత్యమను వాటిలో కనబడుచున్నది (ఎఫెసీ 5:9). గనుక ప్రభువు కేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి. నిష్ఫలమైన అంధకారక్రియలలో పా[లి]వారై యుండక వాటిని ఖండించుడి (ఎఫెసీ 5:10, 11). ఒకడు ఎప్పుడు వెలుగు సంబంధి కాగలడు? ప్రభువైన యేసునందు విశ్వాసముంచి, మారుమనస్సు పొంది, నోటితో ఒప్పుకొని బాప్తిస్మము పొం[ది] వాక్యానుసారముగా ఆయనను ఆరాధించునప్పుడు కాగలడు.

—పి. చంద్రశేఖర్

---

SATYA WAKKU
P.O. Box 80
KAKINADA–533 001

Printed Book only

To

..........................................
..........................................
..........................................
..........................................